



• సభా వేదికపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు

• మాట్లాడుతున్న సీఎం

జిల్లాతో ప్రత్యేక అనుబంధం

- ఆర్మూర్ సభ తర్వాతే తాను పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగా
- జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా చేస్తా
- సెప్టెంబరు 17 నాటికి నిజాం చక్కెర ఫ్యాక్టరీలపై నిర్ణయం
- బహిరంగలో సీఎం రేవంత్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాతో నాకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఇక్కడి ఆర్మూర్ సభ తర్వాతే తాను పీసీసీ అధ్యక్షుడిని అయ్యానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడి రైతులు ఆలోచించి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని, ఆయనకు ఓటు వేస్తే తనకు వేసినట్లేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని చేయడంతో పాటు పసుపు బోర్డును జిల్లాలోనే ఏర్పాటు చేసే విధంగా చూస్తానన్నారు. జిల్లా నుంచి ఎంతో మంది ఎదగడంతో పాటు పేరు తెచ్చారన్నారు. జిల్లాకు చెందిన నారాయణరెడ్డి తెలంగాణ ఉద్యమంలో పనిచేశారన్నారు. ఆయన పార్లమెంట్‌కు ఎన్నికై గొంతు వినిపించారన్నారు. జిల్లాకు చెందిన అర్గుల్ రాజారాం మంత్రిగా పనిచేయడంతో పాటు పేదల గొంతుకను వినిపించారన్నారు. జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ బాక్సింగ్‌లో ఎదిగి పేరు తీసుకువచ్చారన్నారు. ఎవరెస్టు శిఖరాన్ని చిన్నవయస్సులో అధిరోహించిన మాలావత్ పూర్ణ జిల్లాకే వన్నె తెచ్చారన్నారు. వీరే కాకుండా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, డి.శ్రీనివాస్‌తో పాటు ఇతర నేతలు కూడా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ ఏర్పాటులో మధుయాష్కీగౌడ్ కీలక పాత్ర జిల్లా నుంచి 2004-2009 పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడంతో పాటు తెలంగాణ ఏర్పాటులో మధుయాష్కీగౌడ్ కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. రైతు నేతగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే మీ తరఫున పార్లమెంట్‌లో గొంతును వినిపిస్తాడన్నారు. ఐదు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశామని, పంద్రాగస్టు నాటికి రుణమాఫీని చేస్తామన్నారు. సెప్టెంబరు 17 నాటికి నిజాం చక్కెర కర్మాగారాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీని నియమించామన్నారు. వచ్చే సీజన్ నుంచి వరి ఎంత వేసినా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. క్వింటాలుకు 500 రూపాయల బోనస్‌ను అందిస్తామన్నారు. మత విద్వేశాలను రెచ్చగొట్టే వారిని నమ్మవద్దన్నారు. బాండ్ పేపర్ల పేరు మీద హామీలిచ్చి మోసం చేసిన అర్వింద్‌ను నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు. పసుపు బోర్డు నోటిఫికేషన్ ఇచ్చి ఎక్కడ పెడతారో స్పష్టం చేయలేదన్నారు. రైతులకు పసుపు బోర్డు ఏమిటో స్పైసెస్ బోర్డు ఏమిటో స్పష్టంగా తెలుసన్నారు. పంజాబ్, హర్యానా రైతుల్లాగానే జిల్లా రైతులు చైతన్యవంతులని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అర్వింద్‌ను గెలిపించడం వల్ల ఉపయోగం లేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపిస్తే ఆయన కొడుకులే పాలన చేస్తారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే 2019లో కవితను ఇంటికి పంపించిన చరిత్ర ఇక్కడి రైతులదేనన్నారు. ఆ ఎన్నికల్లో 186 మంది వరకు పోటీ చేయడంతో పాటు నిలబడ్డారన్నారు. వారణాసికి పోయి కూడా పోటీ చేసిన ఘనత ఇక్కడి రైతులదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్, సీనియర్ నేతలు మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, రాజేశ్వర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, మాజీ విప్ అనిల్, ప్రేమలత అగర్వాల్, ఏబీ శ్రీనివాస్, గడుగు గంగాధర్, కేశవేణు, కైలాస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



• బహిరంగ సభకు హాజరైన జనం





• పార్టీ శ్రేణుల్లో జోష్..

నిజామాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభ విజయవంతమైంది. ఈ సభకు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. సభలో పాల్గొన్నారు. సభ ఆలస్యమైనా ఎండలో వేచి చూశారు. పూర్తిస్థాయిలో సభ అయ్యేంతవరకు ఉండటంతో పాటు రేవంత్‌రెడ్డి మాట్లాడే సమయంలో జోష్‌లో ఉన్నారు. సభకు పార్లమెంట్ పరిధిలోని నేతలంతా హాజరుకావడంతో పాటు సభ విజయవంతానికి కృషి చేశారు.



• పోలీసుల భారీ బందోబస్తు..

సీఎం రేవంత్‌రెడ్డి సభ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గిరిరాజ్ కళాశాల నుంచి పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు రోడ్ల వెంట భారీ కేడ్‌లను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు భారీ ఎత్తున పోలీసులను నియమించారు. సీపీ కల్మేశ్వర్ ఆధ్వర్యంలో బందోబస్తును కొనసాగించడంతో పాటు ఎలాంటి ఆందోళనలు జరగకుండా చూశారు. సీఎం వచ్చి వెళ్లేంతవరకు ఈ బందోబస్తును కొనసాగించారు. సభ ప్రాంగణం వద్ద భారీ ఎత్తున పోలీసులను నియమించి బందోబస్తును కొనసాగించారు. జిల్లా పోలీసులతో పాటు ఇతర జిల్లాల పోలీసులను రప్పించి ఈ బందోబస్తును కొనసాగించారు.

• సీఎం సభ సైడ్‌లైట్స్..

- సీఎం సభ మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది.
- 12గంటలకు రావాల్సిన సీఎం మధ్యాహ్నం 3గంటలకు వచ్చారు.
- 3.05 గంటలకు సీఎం సభా వేదికపైకి వచ్చారు.
- హెలికాప్టర్‌లో సీఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు వచ్చారు.
- సీఎంకు జిల్లాకు చెందిన నేతలు షబ్బీర్‌అలీ, మధుయాష్కీ, సుదర్శన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు స్వాగతం పలికారు.
- 3.40 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రారంభించి 4.20 గంటలకు ముగించారు.
- 4.40 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం తిరుగు ప్రయాణమయ్యారు.
- ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటాపాట ఆకట్టుకుంది.
- సీఎం సభవేదికపైకి రాగానే మూడు రంగుల జెండాపట్టి సింగమోలె కదిలినాడు అనే పాటకు కార్యకర్తలు నృత్యాలు చేశారు.
- హనుమాన్ భక్తులు జీవన్‌రెడ్డికి నామినేషన్ రుసుమును అందజేశారు.

సెప్టెంబరులోగా చక్కెర ఫ్యాక్టరీలను ప్రారంభిస్తాం..

• జీవన్‌రెడ్డి (కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి)



సెప్టెంబర్‌లోగా బోధన్‌తో పాటు ముత్యంపేట చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటులో నిర్లక్ష్యం వహించడం వల్ల కవితను ఓడించారని రైతులంతా అర్వింద్‌ను గెలిపిస్తే పసుపు బోర్డు కోసం బాండ్ రాసిచ్చి ఇప్పుడు పసుపు బోర్డు ఎక్కడో జవాబు చెప్పడం లేదన్నారు. పసుపునకు నాణ్యత పెరిగేలా, సాగు పెరిగేలా, ధర పెరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు.

రైతుల పక్షాన మాట్లాడేవారు కావాలి..

• సుదర్శన్‌రెడ్డి (బోధన్ ఎమ్మెల్యే)



కాంగ్రెస్ పార్టీవల్లే రైతు రాజ్యం వస్తుందని పార్లమెంట్‌లో రైతుల పక్షాన మాట్లాడే వారిని ఈ ఎన్నికల్లో గెలిపించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. అనుభవం కలిగిన జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే కేంద్రంలో ప్రజాప్రభుత్వం రావాలని అందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

రేవంత్‌కు తోడుగా నిలిచేందుకు వచ్చా..

• మధుయాష్కీగౌడ్ (ప్రచార కమిటీ చైర్మన్)



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయని తన తల్లి మరణించి వారం రోజులైనా సీఎం రేవంత్‌రెడ్డికి అండగా ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి వచ్చానని మధుయాష్కీగౌడ్ అన్నారు. తాను ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఉన్న వాతావరణమే కనిపిస్తుందని నిజామాబాద్‌ను అన్నపూర్ణగా చేయాలంటే జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

ప్రధాని మోదీ వ్యాఖ్యలు అభ్యంతరకరం..

• షబ్బీర్‌అలీ (రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు)



దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే హిందువుల భూములను ఇతర కులాల వారికి పంచే ఇచ్చే అవకాశం ఉందని ప్రధాని మోదీ రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యానించడం సిగ్గుచేటని షబ్బీర్ అలీ అన్నారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడటం దారుణం. కేంద్రంలో ఉన్న మతతత్వ ప్రభుత్వాన్నిదించేందుకు ప్రజలకు వచ్చిన అవకాశం ఇది అని అన్నారు.

అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యం..

• భూపతిరెడ్డి (రూరల్ ఎమ్మెల్యే)




గత ఐదేళ్లలో ఎంపీగా అర్వింద్ జిల్లాకు చేసింది ఏమీ లేదని పదేళ్లలో నిజామాబాద్ పార్లమెంట్‌లో అభివృద్ధి కుంటుపడిందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల్లోనే అమలు చేసింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే. లక్ష ఓట్ల మెజార్టీతో జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.





• గోల్‌హనుమాన్ ఆలయం



• ముస్తాబైన సారంగాపూర్ ఆలయం

హనుమాన జయంతికి ఆలయాల ముస్తాబు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22: జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలకు హనుమాన్ ఆలయాలు ముస్తాబయ్యాయి. చైత్రపౌర్ణమి నాడు వచ్చే హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. నగర శివారులోని సారంగపూర్ హనుమాన్ ఆలయం, గోల్‌హనుమాన్, రోకడ హనుమాన్, చీర్ హనుమాన్, నీరుగొండ, నల్లహనుమాన్ ఆలయాలతో పాటు తుంగిని వద్ద గల హనుమాన్ ఆలయాలను నిర్వాహకులు అందంగా తీర్చిదిద్దారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో శోభాయాత్రను నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శోభాయాత్ర నగరంలోని కంఠేశ్వర్ ఆలయం నుంచి మొదలై జిల్లా పరిషత్, హమల్‌వాడి, పాత ప్రభాత్‌టాకీస్, లలితమహల్ రైల్వే గేట్, గోదాం రోడ్, దేవిరోడ్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, ఆజాంరోడ్, పెద్దపోస్టాఫీస్, పెద్దబజార్, లక్ష్మిమెడికల్, పోతలింగన్న దేవాలయం మీదుగా రాజరాజేంద్ర చౌరస్తా వరకు సాగనుంది.

నగరంలో పోలీసుల బందోబస్తు

ఖిల్లా: హనుమాన్ శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. ఇందు కోసం నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, ములుగు జిల్లాల నుంచి సుమారు 1200 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. అలాగే నగరంలో శోభాయాత్ర సందర్భంగా వాహనాలను దారి మళ్లీస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ శింగనేవార్ తెలిపారు. శోభాయాత్ర వెళ్లే దారిలో సోమవారం రాత్రి 8గంటల నుంచి 24ఉదయం 6గంటల వరకు రోడ్డుపై, వాణిజ్య సముదాయాల ఎదుట వాహనాలను పార్కింగ్ చేయరాదని తెలిపారు. ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించ వద్దని సూచించారు.

నేడు రామాలయంలో రథోత్సవం

ఇందల్వాయి, ఏప్రిల్ 22: ఇందల్వాయి గ్రామంలో మంగళవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఎంతో ఘన చరిత్రగల రామాలయానికి గ్రామానికి చెందిన వడ్ల దశరథ్ అనే వ్యక్తి రామాలయంలోని రథం శిథిలావస్థకు చేరడంతో ఆయన కోటి రూపాయలు ఖర్చు చేసి ఆలయానికి నూతన రథాన్ని చేయించారు. ఈ రథానికి అందమైన రంగులు వేసి ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రి హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవం ఉంటుందని అన్నారు. పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి రథాన్ని అందించిన దశరథ్‌ను గ్రామస్థులు అభినందించారు. బుధవారం చక్రతీర్థం గురువారం నాగవెల్లి ఉంటుందని ఆలయంలో కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి గోపాలచారి తెలిపారు.





• ముస్తాబైన ఇందల్వాయి రామాలయం



రామాలయానికి చేయించిన నూతన రథం



కొనసాగుతున్న నామినేషన్లు

- సోమవారం 12 నామినేషన్ల దాఖలు
- ఈ నెల 25తో ముగియనున్న గడువు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి సోమవారం 12 నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సయ్యద్ అస్గర్ సోమవారం రెండో సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మూడో సెట్ నామినేషన్ పత్రాన్ని అందజేశారు. బహుజన్ ముక్తిపార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్ మూడవ సెట్, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి తరఫున రెండవ సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వీరితో పాటు అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యుగందర్ గట్ల, మన తెలంగాణ రాష్ట్ర సమైక్యతా పార్టీ అభ్యర్థిగా పోతు అశోక్‌లు నామినేషన్‌లు వేశారు. దర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా ఆర్.రాజేందర్, రాపెల్లి శ్రీనివాస్‌లు రెండవ సెట్ నామినేషన్లు వేశారు. నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విఠల్ మాలావత్, స్వతంత్ర అభ్యర్థిగా కాత్రాజి ప్రశాంత్, యుగతు లసి పార్టీ అభ్యర్థిగా కోటగిరి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 28 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈనెల 25తో నామినేషన్ల గడువు ముగియనుంది.

నామినేషన్‌కు సమయం మించిపోవడంతో వెనుదిరిగిన సీఎం

● నేడు నామినేషన్ వేయనున్న జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22: సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డితో పాటు నామినేషన్ వేసేందుకు సమయం మించిపోవడంతో జిల్లా కలెక్టరేట్ గేటు వద్దనుంచి వెనుదిరిగారు. ఆదిలాబాద్ బహిరంగ సభను ముగించుకొని నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో హెలిక్యాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం నామినేషన్ వేసేందుకు బయలుదేరగా అప్పటికే సమయం ముగియడంతో వెనుదిరిగి బహిరంగ సభకు వచ్చారు. సీఎంతో కలిసి నామినేషన్ వేసేందుకు జీవన్‌రెడ్డి సోమవారం నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకున్నారు. ఉదయం నగరంలోని నీలకంఠేశ్వర ఆలయానికి వెళ్లి పూజలు చేసి నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. సమయం ముగియడంతో ఆయన నామినేషన్ వేయలేదు. మంగళవారం ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు.

'బీజేపీ పాలనలో రైతుల ఆదాయం రెట్టింపు'

పెద్దబజార్, ఏప్రిల్ 22: బీజేపీ పాలనలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కిసాన్ మోర్చా రైతులతో సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రైతు ఎంత అవసరమో నరేంద్రమోదీ అంతే అవసరమని, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అగ్రికల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దడమే అర్వింద్ ధర్మపురి లక్ష్యమని అన్నారు. రైతు వ్యతిరేకులైన బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డిని ఓడించడం కోసం రైతులందరూ కంకణం కట్టుకున్నారని అన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వంలో వరి రేటు క్వింటా రూ.1200 అయితే న రేంద్ర మోదీ వచ్చిన తర్వాత రైతులకు రూ. 1900 నుంచి రూ. 2200 వరకు క్వింటాకు పలుకుతుందన్నారు. రైతు కళ్లలో ఆనందానికి వచ్చిన రోజులని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో యూరియా, డీఏపీ కోసం రైతులు సొసైటీల ఎదుటక్యూలో నిలబడే వారని, ఇప్పుడు నరేంద్రమోదీ వచ్చిన తర్వాత ఎవరైనా గానీ రైతులు క్యూలో నిలబడే పరిస్థితి లేకుండా వచ్చిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మవద్దని అన్నారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డి మామిడి రైతులను పట్టించుకున్న పాపానలేదన్నారు. మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రైతుల సమస్యను పట్టించుకోక పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిగా ఏ మొహం పెట్టుకొని నిలబడుతున్నాడని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు కోసం కేంద్రంలో పోరాడి పసుపు బోర్డు తెచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భరత్‌భూషన్, హరీష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సాయిలు (ఫైల్)

నవీపేట, ఏప్రిల్22: మండలంలోని నాగేపూర్‌కు చెందిన నేత సాయిలు (42) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేపూర్‌కు చెందిన నేత సాయిలు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సాయిలు తనవెంట మరో ఇద్దరు యువకులతో కలిసి బైక్‌పై నాగేపూర్ నుంచి నవీపేటకు వెళ్లారు. ఈ క్రమంలో నాగేపూర్ మూలమలుపు దాటిన కొద్దిదూరంలో రోడ్డు పక్కన ఉన్న ధాన్యం కుప్పను బైక్ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సాయిలు అక్కడికక్కడే మృతిచెందగా బైక్‌పై ఉన్న మరో ఇద్దరు యువకులు సంఘటనస్థలం నుంచి పారిపోయారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'శ్రామికవర్గస్థాపన కోసం పార్టీ శ్రేణులు పోరాడాలి'

పెద్దబజార్, ఏప్రిల్ 22: శ్రామికవర్గ స్థాపన కోసం పార్టీ శ్రేణులు నిరంతరం పోరడాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి ఆకుల పాపయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్‌భవన్ ఎదుట సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జన జాతర సక్సెస్

● రేవంత్‌రెడ్డి పర్యటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్



సీఎం రేవంత్‌రెడ్డితో మండవ వెంకటేశ్వర రావు మాటామంతి

నిజామాబాద్ జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ 'జన జాతర' సక్సెస్ అయ్యింది. ఈ సభకు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజక వర్గాల నుంచి నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. సభ ఆలస్యమైనా రేవంత్‌రెడ్డి కోసం గంటల తరబడి ఎండలో వేచి చూశారు. పూర్తి స్థాయిలో సభ అయ్యేంతవరకు ఉండడంతో పాటు రేవంత్‌రెడ్డి మాట్లాడే సమయంలో కార్యకర్తలంతా జోష్‌లో ఉన్నారు.

(నిజామాబాద్ అర్బన్)



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాగలిని బహూకరిస్తున్న దృశ్యం



సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు



సభలో జోష్‌ను పెంచుతున్న కళాకారులు

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



సీఎం బహిరంగ సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్,ఏప్రిల్22: జిల్లా కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు బోధన్, సాలూర మండలాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ అల్లె లావణ్య రమేష్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్‌లతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

డిచ్‌పల్లి: పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు డిచ్‌పల్లి మండలం నుంచి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో 500మంది కార్యకర్తలను వాహనాల్లో తరలించారు. సీఎం సభకు వెళ్లిన వారిలో కంచెట్టి గంగాధర్, వాసుబాబు, షాదుల్లా, సురేందర్‌రెడ్డి, మదుసుధన్,బాలగంగాధర్, వెంకన్న, ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



మోర్తాడ్‌లో కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మోర్తాడ్‌లోని ప్రజా భవన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మోర్తాడ్ ఉపసర్పంచ్ సొక్కయి గంగారెడ్డి, దొన్కల్ మాజీసర్పంచ్ పర్సదేవన్న, ఉపసర్పంచ్ లింగన్న, మాజీసర్పంచ్ ముత్యాల లింగన్న, మోర్తాడ్ బీఆర్ఎస్ నాయ కులు ప్రకాష్, మోహన్, రవి, ప్రమోద్‌గౌడ్, రంగిరి, బెల్దారి మోహన్, తది తరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, జిల్లా కార్యదర్శి గిర్మాజి గోపి, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన తాజామాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మోర్తాడ్‌లోని ప్రజాభవన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మోర్తాడ్ తాజామాజీ ఉపసర్పంచ్ సొక్కయి గంగారెడ్డి, దొనప్కల్ మాజీసర్పంచ్ పర్స దేవన్న, ఉపసర్పంచ్ లింగన్న, మాజీసర్పంచ్ ముత్యాల లింగన్న, మోర్తాడ్ బీఆర్ఎస్ నాయకులు ప్రకాష్, మోహన్, రవి, ప్రమోద్‌గౌడ్, రంగిరి, బెల్దారి మోహన్, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, జిల్లా కార్యదర్శి గిర్మాజిగోపి,మహిపాల్,తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



బాల్కొండలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్సై

ముప్కాల్, ఏప్రిల్22: బాల్కొండ మండల కేంద్రంలో జమ మసీదు వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్సై శంకర్ మాట్లాడుతూ గ్రామంలో యువకులు గంజాయికి అలవాటుపడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, ఎవరైనా గంజాయి అమ్మిన, గంజాయి తాగిన సమాచారం ఇవ్వాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి సమాచారం సేకరిస్తారని వాటి ద్వారా మీ అకౌంట్ నుంచి డబ్బులు మాయం చేస్తారని, ఎవరైనా గుర్తుతెలియని వారు ఫోన్ చేస్తే సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందించాలని అన్నారు. చిన్న పిల్లలు స్మార్ట్ ఫోన్ వాడటం వల్ల అందులో కొత్తగా యాప్ వేసుకొని సైబర్‌నేరాలకు బలి అవుతున్నారని, సెల్‌ఫోన్ ఉపయోగించకుండా చూడాలని అన్నారు. ఎవరైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 100నెంబకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు విట్టల్, లింగన్న, సాయికుమార్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

భాషిత పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పెర్కిట్, ఏప్రిల్22: ఆర్మూర్ పట్టణంలోని బాషిత హైస్కూల్ సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నటరాజ్ పంక్షన్‌హాల్‌లో పీపీ-3 విద్యార్థులకు కిండర్ గ్రాడెన్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పట్టణ ఐఎంఏ సెక్రెటరీ డాక్టర్ రాంగిరి బాను, కోశాధికారి డాక్టర్ యు.రాకేష్‌లు పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మరియమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



గోవూర్ ఆలయంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

మోస్రా,ఏప్రిల్22: మండలంలోని గోవూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మరియమ్మ తల్లి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో పయనించాలని అన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మండల నాయకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో ధాన్యంతో వెళ్తున్న లారీ బోల్తా

● రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు



డిచ్‌పల్లిలో బోల్తా పడిన లారీ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 22: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట నిజామాబాద్-డిచ్‌పల్లి ప్రధాన రహదారిపై వరిధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. 200 ధాన్యం బస్తాలు నేలపాలయ్యాయి. లారీలో ధాన్యం నిజామాబాద్ వైపు తరలిస్తుండగా డిచ్‌పల్లిలో బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పాడింది. మరో లారీలో కింద పడిన ధాన్యం బస్తాలను అక్కడి నుంచి తరలించి రాకపోకలకు క్లియరెన్స్ చేయించారు.

కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో పోరాడుదాం



బోధన్‌లో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్22: అసమానతలు లేని దోపిడి రహిత సోషలిస్టు సమాజం కోసం కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో పోరాడుతామని సీపీఎం(ఎంఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సోమవారం బోధన్‌లో ప్రపంచ ప్రథమ సోషలిస్టు, విప్లవ సారథి కామ్రేడ్ లెనిన్ 154వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామికులు, కర్షకుల కోసం విప్లవానికి నాయకత్వం వహించి ఆకలి, పేదరికం, మతం, జాతి, దోపిడి లేని సమసమాజాన్ని నిర్మించడానికి లెనిన్ అనేక పోరాటాలు చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా విప్లవాలకు ఆయా దేశాల రాజకీయ వ్యవస్థల మార్పుకు కారణం అయ్యాడని లెనిన్ స్ఫూర్తితో భారతదేశంలో విప్లవ సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, రాం, లక్ష్మణ్, ధ్యాకం పోశెట్టి, బాలాజీ, శంకర్, ఫారూఖ్, ఇమ్రాన్, షేక్.అబ్లీ, సాయిలు, శంభు, బుజ్జి, పోశెట్టి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ జయంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని సిరికొండ మండల కేంద్రంలో అరుణాపతాకాన్ని ఎగురవేసి మాస్‌లైన్ నాయకులు ఉత్సవాలను ప్రారంభించుకున్నారు.ఈ సందర్భంగా మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్‌స్ఫూర్తితో విప్లవోద్యమాన్ని నిర్మిద్దామని, బలమైన ప్రజాతంత్ర పోరాటాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.శ్రమకు తగిన ఫలితం రావాలని,ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించబడాలని ఆయన అన్నారు. ఒక మనిషిని మరొక మనిషి దోపిడీ చేయని వ్యవస్థ కావాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పోరాడుతుందన్నారు. మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ జయంతిని పురస్కరించుకుని సీపీఐఎంఎల్ ఆవిర్భా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు రామకృష్ణ చెప్పారు.పెట్టుబడిదారి వ్యవస్థలో శ్రామిక వర్గం అడుగడుగున దోపిడికి, అవమానాలకు గురవుతుందన్నారు. భూర్జువ నాయకుల పాలనలో పేదలు మరింత పేదలుగా మగ్గుతున్నారని ఆయన అన్నారు. ప్రపంచంలో సామ్రాజ్యవాదం యుద్ధాలను కోరుకుంటుందని అన్నారు.పెట్టుబడుల విస్తరణలో భాగంగానే అమెరికా లాంటి అగ్రరాజ్యాలు చిన్నదేశాల మధ్య యుద్ధాన్ని అనివార్యంగా రుద్దుతుందన్నారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా కార్మికులు,రైతులు,ఐక్యంగా పోరాడాలని రామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.రమేష్,దామోదర్,ఈ.రమేష్,లింబాద్రి, కిషోర్,నారాగౌడ్,ఎర్రన్న, బాల్‌రెడ్డి,పండరి,అనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథ ఆధ్వర్యంలో సోమవారం కామ్రేడ్ లెనిన్ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రామికులను ఏకం చేస్తూ ప్రపంచ చరిత్రలో విప్లవకారులలో ముందు నిలిచిన కామ్రేడ్ లెనిన్ ఆశయాలను సాధించాలని వారు పోరాటం చేసిన శ్రామికవర్గం వైపు అందరు నడవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్)పార్టీ జెండాను ఎగురవేశారు.ఈకార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షు డు ముత్తెన్న, నాయకులు తలారి గంగాధర్, ఆకుల గంగన్న, సునీత, లక్ష్మీ, అనిల్‌కుమార్, అర్వింద్, నజీర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలందరూ బీజేపీకి మద్దతుగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలందరు బీజేపీ పార్టీకి మద్దతుగా ఉంటూ బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలను అణిచివేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ మాలలకు కొమ్ముకాస్తుందని దానికి నిదర్శనమే ప్రస్తుత మూడు ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించలేదని అన్నారు. విద్య, ఉద్యోగ, సాంఘీక సంక్షేమ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతున్న మాదిగల భవిష్యత్ మారాలంటే ఎస్సీ వర్గీకరణ ద్వారా జరుగుతుందని తెలిపారు. వర్గీకరణ సాధనలో కీలక దశకు రావడంతో బీజేపీ పార్టీ వర్గీకరణ సమస్యను పరిష్కరం దిశగా కృషి చేస్తుందని మాదిగలందరు బీజేపీకి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కో ఇన్‌చార్జీ శ్యామ్‌మాదిగ, మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, ప్రదీప్, గోముటు పద్మ, సంకేపల్లి విప్లవ్, సందీప్, సుద్దపల్లి మార్క్, మైదం గంగాధర్, శాంతికుమార్, తరుణ్, వివిధ మండలాల, గ్రామాల ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో తడిసిన ధాన్యం



కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యం

జక్రాన్‌పల్లి,ఏప్రిల్22: జక్రాన్‌పల్లి మండలంలో సోమవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని ఉరుములు, మె రుపులు, ఈదురు గాలు లతో కూడిన వర్షం కురి సింది. దీంతో అన్ని గ్రామా ల్లో కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యం తడకుండా టాటి పత్రిలు కప్పి ఉంచగా వీచిన భారీ ఈదురుగాలులకు టాటిపత్రులు కొట్టుకుపో యాయి. దీంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేసి ధాన్నాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని రైతు లు కోరుతున్నారు.

'పోరాటాలతోనే ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం'

సిరికొండ ఏప్రిల్ 22: నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాది హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును తగ్గిస్తూ పథకాన్ని రద్దు చేసే చర్యలకు పూనుకుంటుందని, పథకాన్ని కాపాడుకోవడానికి మనమంత పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ కూలీలకు పిలుపునిచ్చారు.సిరికొండ మండలం రామడుగు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలతో పథకం తీరుతెన్నులపై , చేస్తున్న పనులకు కూలీ డబ్బులు సక్రమంగా వస్తున్నాయ అని రమేష్ అడిగి తెలుసుకున్నారు. ఇచ్చేది తక్కువ కూలీ అయినప్పటికి వేసవి కాలంలో ఎలాంటి ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక ఉపాధి పనులకు వెళ్తున్నారని అన్నారు.నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ పేరుతో మొబైల్ యాప్‌ను ప్రారంభించిన నేపధ్యంలోనే కార్మికులకు సమస్యలు మొదలయ్యాయన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గిస్తూ పథకాన్ని నీరుగార్చుతుందన్నారు.బడ్జెట్‌లో అధికంగా నిధులను కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో కొలతలో సంబంధం లేకుండా కూలీలకు రోజుకు రూ.700లు చెల్లించాలని,వారానికి ఒకసారి మస్టర్ ప్లే స్లిప్పులను కూలీలకు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, వారానికోసారి వేతనాలను చెల్లించాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కూలీలకు పది లక్షల ప్రమాద బీమాను కల్పించాలని, ప్రమాదంలో చనిపోయిన కూలీల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని ఆయన అన్నారు.జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రెండువందల రోజుల పనిదినాలను కల్పించాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని రద్దు చేయకుండా బడ్జెట్‌లో అధిక నిధుల కేటాయించే విధంగా కూలీలంతా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ప్రగతీశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి సభ్యులు ఈ.రమేష్,కిషోర్,దామోదర్ తదితరులు పాల్గోన్నారు.

108సిబ్బందికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు



108 సిబ్బందికి అవార్డులు అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్22: బోధన్‌లో 108లో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీ లక్ష్మణ్, పైలెట్ జావీద్‌లకు సోమవారం హైదరాబాద్‌లో 108జీవీకే ఈఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ సేవ అవార్డులను సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108అత్యవసర సమయాల్లో ఆపదలో ప్రాణాలు కాపాడుతుందని, 108లో విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 108జీవీకే ఈఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, సీఈవో డాక్టర్ వెంకటేష్, ఖలీద్, రవి కుమార్, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవీపేట,ఏప్రిల్22: మండల కేంద్రంలో సోమవారం బాధిత కుటుంబాలను బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా పరామర్శించారు. మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఉపాధి కూలీ ర్యాగళ్ల లావణ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అడెపు కిష్టబాయి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ రావు, తెడ్డు పోశెట్టి, మల్లేష్, సూరిబాబు, జావీద్ తదితరులున్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలి

ఏర్గట్ల, ఏప్రిల్ 22: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్క కూలీకి 200 రోజుల పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జికిషన్, సీపిఎం మాస్‌లైన్ ప్రజాపంత ఆర్మూర్ డివిజన్ నాయకులు బి అశోక్ తెలిపారు. సోమవారం మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలను తెలుసుకొని మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రూ.300 రూపాయలు కాకుండా రోజు వారీ కూలీ ప్రతీ మనిషికి రూ.600 చెల్లించాలన్నారు. ప్రతీ కూలీకి భీమా సౌకర్యం, రూ.5లక్షల ప్రమాధ భీమా, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ.20వేల జీతం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సీతక్క, లక్ష్మీ, జమున, శీను తదితరులు పాల్గొన్నారు.

నేడు పంటల సాగుపై శాస్త్రవేత్తల సూచనలు

డిచ్‌పల్లి ఏప్రిల్ 22: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో మంగళవారం ఉదయం 9గంటలకు రైతులకు వరి పంటలో నేరుగా వెదచల్లే పద్ధతి మామిడి సాగులో నాణ్యత గుర్తింపు కు పాటించాల్సిన సూచనాలను, అంశాలను హైదరాబాద్ నుంచి సైంటిస్టులు వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో నూతన పంటల సాగు కోసం శాస్త్రవేత్తల సలహాలు, రైతులకు అడగాలన్నారు.

మోకన్‌పల్లిలో పిడుగు పడి ఆవు మృతి

నవీపేట,ఏప్రిల్22: మండలంలోని మోకన్‌పల్లిలో సోమవారం సాయంత్రం పిడుగుపడి ఆవు మృతి చెందింది. స్థానిక మిర్యాల ఒడ్డెన్న అనే రైతుకు చెందిన ఆవు అంజుమాన్ ఫారం చెరువు కట్ట వద్ద మేత మేస్తుండగా పిడుగు పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఆవు మృతితో రైతుకు సుమారు రూ.50వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలనిస్థానికులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎడపల్లి, ఏప్రిల్ 22: ఎడపల్లి మండలంలోని అలీసాగర్ లిఫ్ట్ సమీపంలో బోదన్-నిజామాబాద్ ప్రదాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ నుంచి నిజామాబాద్ వైపు ఆక్టీవా వాహంపై ఇద్దరు మహిళలు వెలుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొనడంతో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటనను చూసిన వాహనదారులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిలా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళలు

రైతుల విషయంలో కాంగ్రెస్ ఫెల్యూర్: ఎంపీ



కుద్వాన్‌పూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

నందిపేట, ఏప్రిల్22: రైతుల విషయంలో కాంగ్రెస్ పార్టీ అన్ని రకాలుగా ఫెల్యూర్ అయ్యిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. సోమవారం మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రంలో తడిసిన వరిధాన్యాన్ని, అలాగే అకాల వర్షం, ఈదురుగాలులకు నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం నూతన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెస్తే కాంగ్రెస్ పార్టీ పంజాబ్ ప్రజలతో నానా రభసా చేయించారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చడంలేదని అరివంద్ అన్నారు. వరిధాన్యానికి క్వింటాలుకు రూ.500బోనస్, రైతుల రుణమాఫీ ఊసేలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రైతులను కాపాడే బాధ్యత ప్రధానమంత్రి మోదీయేనని గుర్తు చేశారు. కోతలు కోసిన గంటలోపే ధాన్యం కల్లాల నుంచి తరలించారని, 24గంటల లోపు ధాన్యానికి సరిపడే డబ్బులు రైతు ఖాతాల్లో జమ కావాలని ఎంపీ అర్వింద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బూతం సాయిరెడ్డి, సీనియర్ నాయకులు బద్దం నడ్పన్న, ఆరే గంగాధర్, గంగారాం, నాగ సురేష్, తదితరులు ఉన్నారు.

లింగమయ్య గుట్టలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



నవీపేట లింగమయ్య గుట్టలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,ఏప్రిల్22: మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన సోమవారం మహా గణపతి పూజ, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మండప ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసము, శయాధివాసము కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎరువులను పీఏసీఎస్ ద్వారానే విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్



బాల్కొండలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ముప్కాల్, ఏప్రిల్22: బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో సొసైటీ గోదాంన్ని సోమవారం జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులను పీఏసీఎస్ ద్వారానే రైతులకు విక్రయించాలని, ఎప్పటికప్పుడు అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లను ఆయన ఆదేశించారు. బిల్లుబుక్, స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. అనంతరం ఇత్వార్‌పేట్‌లో నువ్వుపంటను పరిశీలించారు. నువ్వు పంటకు సస్యరక్షణ చర్యలు చేపటాలని రైతులకు సూచించారు.మద్దతు ధరతో పాటు రైతుల నుంచి ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. వరి కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా గన్నీబ్యాగులు, కూలీలను, లారీలను సమకూర్చాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మల్లయ్య, ఏఈవో, సొసైటీ కార్యదర్శి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 22: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పరీక్షకు 865మంది విద్యార్థులకు గాను 826 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 39మంది గైర్హాజరయ్యారని, ఘంట చంద్రశేఖర్ తెలిపారు. బీఎడ్ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ కళాశాల బాన్సువాడ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆడిట్ సెల్ అధికారులు తెలిపారు.

డిచ్‌పల్లి, నవీపేటలో భారీ వర్షం

డిచ్‌పల్లి,ఏప్రిల్22:డిచ్‌పల్లి మండల వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం భారీవాన కురిసింది.దూస్‌గాం,ముల్లంగి, మిట్టపల్లి, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల్లో ఆకాల వర్షంతో ధాన్యం బస్తాలు, వరి కుప్పలు తడిసిపోయాయి. ధాన్యంపై టర్పెన్‌లు కప్పిన ధాన్యం తడవకుండా ఆగలేదు. ఆకాల వర్షం తో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పాడింది.

నవీపేట: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కొద్దిపాటి వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కల్లాలు, రోడ్డు పక్కన ఉన్న ధాన్యం రాసులపై రైతులు టార్పాలిన్ కవర్లను కప్పి ఉంచారు. అకాల వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

హనుమాన్ జయంతికి ముస్తాబైన ఆలయాలు

● జిల్లాలోని హనుమాన్ ఆలయాలు ముస్తాబు ● భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు



బోధన్‌లో ముస్తాబైన మారుతీ మందిరం



డిచ్‌పల్లిలో ముస్తాబైన హనుమాన్ భారీ విగ్రహం

బోధన్‌రూరల్,ఏప్రిల్22: హనుమాన్ జయంతి సందర్భంగా బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లోని హనుమాన్ మందిరాలు ముస్తాబయ్యాయి. హనుమాన్ జయంతి సందర్భంగా సందర్భంగా హనుమాన్ దేవాలయాలకు రంగులతో ముస్తాబు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనుండటంతో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హనుమాన్ సందర్భంగా మారుతీ మందిరంలో ప్రత్యేక పూజలతో పాటు యజ్ఞం, హోమ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వేద పండితులు ప్రవీణ్ మహారాజ్, గణేష్ మహారాజ్, ఉదయ్ పంతులు తెలిపారు. పట్టణంలో నడిబొడ్డు చావిడి వద్ద గల హనుమాన్ మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం బోధన్ పట్టణం మారుతీ మందిరం నుంచి హనుమాన్ జయంతి సందర్భంగా భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని హిందు సంఘాల నాయకులు తెలిపారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం హనుమాన్ జయంతి ఉత్సవాలను హనుమాన్ ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో హనుమాన్ ఆలయాలకు రంగులు వేసి విద్యుత్‌దీపాల ముస్తాబు చేశారు. అన్ని గ్రామాల్లో హనుమాన్ ఆలయాలలో ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలలో భక్తుల అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో ఆంజనే యస్వామి ఆలయంలో సోమవారం హన్మాన్ స్వాములు సాముహిక హన్మాన్ చాలిసా పారాయణం, సింధుర అభిషేకం నిర్వహించారు. 41రోజులు కఠిన నియామలతో హన్మాన మాలదారణస్వాములు హన్మాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయంలో హన్మాన్ చాలిసా పారాయణం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పలువురు స్వాములు కాలినడకన కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో హన్మాన్‌దీక్షదారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని ఆయా గ్రామాల్లో హన్మాన్ ఆలయంలో వేడుకలకు సిద్దమయ్యాయి. హన్మాన్ జయంతి సందర్భంగా భక్తులు హన్మాన్ చాలిసా పారాయణం చేసి భక్తిశ్రద్దలతో అంజనేయకునికి ఇష్టమైన నైవేద్యం సమర్పిస్తారు. గ్రామాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హన్మాన్ ఆలయాలను విద్యుద్‌దీపాలు, రంగులు వేసి ముస్తాబు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించనున్నారు.

డిచ్‌పల్లి: జిల్లాలోనే 40 అడుగుల ఎత్తైన విగ్రహాలు గల డిచ్‌పల్లి ఏడో ప్రత్యేక పోలీస్, బస్టాండ్ వద్ద గల స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలోని హనుమాన్ విగ్రహాలు హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహకులు ముస్తాబు చేశారు. నేడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానుండటంతో భక్తుల శ్రేయస్సు దృష్ట్యా చలువ పందిళ్ల ,తాగునీటి సదుపాయం, ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండు చోట్ల హనుమాన్ జయంతి పురష్కరించుకొని రాజకీయ పార్టీల కు అతీతంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. హనుమంతుని ఆరాధన సేవగుణానికి నిలువెత్తు సాక్ష్యం రాముల వారిని తనగుండెల్లో బంధించుకొని వానర సైన్యం కూడ గట్టి వారధి నిర్మించిన అపర భక్తుడుఆంజనేయుడు విశ్వహిందు పరిషత్ రామజన్మ భూమి ట్రస్ట్ ,హనుమాన్ భక్తులు మూకుమ్మడిగా ఒక్కరొక్కం^గా పోగై హనుమాన్ జెండాతో ఐక్యతతో మారుపేరుగా నిలుస్తూ భారీ ర్యాలీ మండల కేంద్రంలో నిర్వహించున్నారు.జయంతి సందర్భంగా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలు సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

● నేడు తుంగిని హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నవీపేట: మండలంలోని తుంగినిలోని చారిత్రక హనుమాన్ మందిరాన్ని సుందరంగా తీర్చి దిద్దారు. మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పూజలు నిర్వహించనున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ఉదయం 7:30గంటలకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలు హనుమాన్ జయంతి వేడుకలకు ముస్తాబయ్యాయి. మంగళవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

నెగ్గిన అవిశ్వాసం

● వైస్ చైర్మన్‌కు చైర్మన్‌గా బాధ్యతల అప్పగింత



ఇన్‌చార్జి చైర్మన్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న డీసీవో

ధర్పల్లి, ఏప్రిల్ 22: మండలంలోని ఒన్నాజిపేట్ సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సోమవారం సింగిల్ విండో కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు సొసైటీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి 12 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేయగా 12గంటలకు ఓటింగ్ ప్రక్రియను డీసీవో నిర్వహించారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 12మంది డైరెక్టర్లు చేతులెత్తి తమ మద్దతును తెలిపారు. ప్రస్తుతం ఉన్న చైర్మన్ రాజేందర్‌రెడ్డి ఒక్కరే ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను 12 మంది హాజరై అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో చైర్మన్ రాజేందర్‌రెడ్డి తన పదవిని కోల్పోయారు. వైస్ చైర్మన్‌గా ఉన్న మామిడి రాములుకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. గత సంవత్సరం డిసెంబర్ 27న ఎనిమిది మంది డైరెక్టర్లు సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానాన్ని అప్పటి డీసీవో సింహాచలంకు అందజేశారు. జనవరిలో అవిశ్వాసంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో చైర్మన్ రాజేందర్‌రెడ్డి అప్రమత్తమై కోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. మార్చి 27న కోర్టు స్టే ఎత్తివేయడంతో ఏప్రిల్ 22లోపు ఓటింగ్ నిర్వహించాలని ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సోమవారం డీసీవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో అవిశ్వాసంపై ఓటింగ్‌ను నిర్వహించారు. సొసైటీ కార్యాలయం వద్ద ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇంచార్జి చైర్మన్‌గా రాములును నియమిస్తూ ధృవీకరణ పత్రాన్ని డీసీవో అందజేశారు. ఇంచార్జి చైర్మన్‌కు ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, ఒన్నాజిపేట్ మాజీ సర్పంచ్ భగవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ గౌడ్‌లు అభినందించారు.

'పోచారంపై ఆరోపణలు చేయడం సరికాదు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వర్ని,ఏప్రిల్22: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటని వర్ని మండల బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. సోమవారం వర్నిలో విలేకరులతో వారు మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులకు పెండింగ్‌లో ఉన్న రూ.26కోట్ల బకాయిలు ఇవ్వాలని న్యాయబద్ధంగా ఎమ్మెల్యే పోచారం ప్రభుత్వాన్ని కోరితే ఆయన అనుచరులే బిల్లులు స్వాహా చేశారని ఆరోపణలకు దిగడం రవీందర్ రెడ్డి రాజకీయ దిగజారుడుకు నిదర్శనంగా అని విమర్శించారు. బిల్లులు స్వాహా చేశారంటున్న బినామీలు ప్రస్తుతం మీ వెన్నంటే ఉన్నారని వారిని వెనుకేసుకుని విమర్శలు ఎమ్మెల్యేపై చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే అవినీతి మచ్చలేకుండా బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేసి చరిత్ర సృష్టించిన ఘనత పోచారందేనని స్పష్టం చేశారు. శాసనసభ ఎన్నికల్లో 23,500భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రజాదరణ పొందిన పోచారంపై ఓటమిని భరించలేక ఏనుగు రవీందర్ రెడ్డి ప్రజల్లో అసత్య ఆరోపణలు సృష్టించడం భావ్యం కాదని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిలో అక్కడి ప్రజలు దూరం కొట్టడంతో బాన్సువాడలో ఏం సాధిస్తారని మకాం పెట్టారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే పెండింగ్ బిల్లుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం మీ చేతుల్లో ఉన్నందున వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పోచారం అండతో అఖండ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

ఖిల్లా, ఏప్రిల్ 22: హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు నగరంలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, కల్లుడిపోలను మంగళవారం మూసి వేయనున్నట్లు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 24 ఉదయం 6గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంటాయని తెలిపారు. ప్రజలు శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన తెలిపారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం

ఖిల్లా, ఏప్రిల్ 22: నగరంలో తిరిగి కత్తి పోట్ల ఘటన సోమవారం ఆరో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని అర్సపల్లి చౌరస్తా బోధన్‌ప్రధాన రోడ్డు పోలీసు ఔట్‌పోస్టు సమీపంలో చోటు చేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో గంజాయి మత్తులో ఉన్న యువకుడు మరో యువడికిని కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసు కానిస్టేబుల్ స్థానికుల సహాయంతో కత్తిపోటుకు గురైన ఫిరోజ్‌ఖాన్‌గా గుర్తించారు. ఆయనను హుటాహుటిన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంజాయి మత్తులో ఉన్న అక్రమ్‌ఖాన్ పాత కక్షలను మనసులో పెట్టుకుని ఫిరోజ్‌ఖాన్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో మరో యువకుడికి సైతం గాయాలు అయ్యాయి.ఫిరోజ్‌ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన బందోబస్త్‌లో ఉన్న పోలీసులు ముఖ్యమంత్రి పర్యటనలో నిమగ్నమైయి ఉండగా ఈ ఘటన జరుగడంతో నగర ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి దాడి చేసిన అక్రమ్‌ఖాన్ అనే యువకుడిపై కేసు నమోదు చేస్తామని ఆరవ టౌన్ ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఘనంగా బీరప్ప కల్యాణ మహోత్సవం



చిన్నమావంది బీరప్ప ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్22: బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామంలో సోమవారం అంగరంగ వైభవంగా బీరప్ప, కామరతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కుర్మ కులస్థుల ఆరాధ్య దైవమైన బీరప్ప, కామరతిల కల్యాణాన్ని నిర్వహించారు. ఐదు సంవత్సరాలకొకసారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందని కుర్మ సంఘం అధ్యక్షుడు తెలిపారు. ప్రజలందరు సుభిక్షంగా, సుఖశాంతులతో ఉండాలని, పాడిపంట సమృద్ధిగా పండాలని కుల ఆచారం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులతో పాటు మాజీ సర్పంచ్ సింగారి పోచవ్వ, శంకర్, కుర్మ మేత్రి, సింగారి రాజు, పోశెట్టి, శ్రీనివాస్, అశోక్, సాయిలు, సుధాకర్, బాలాజీ, పోశెట్టి, సిరిగిరి దేవరావ్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, రాజు, శంకర్, ఈశ్వర్‌లతో పాటు వివిధ మండలాల కుర్మ సంఘం కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



జన్నేపల్లిలో జీవన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవీపేట,ఏప్రిల్22: మండలంలోని జన్నేపల్లి క్రాసింగ్‌లో సోమవారం ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఇటీవల బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై జీవన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఈ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు జన్నేపల్లి క్రాసింగ్‌లో జీవన్ రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చామంతి రాజు, ప్రదీప్ రావు, బాలరాజు గౌడ్, నారాయణ రావు, బాలచందర్ గౌడ్, అసద్ తదితరులున్నారు.

నేడు జక్రాన్‌పల్లిలో ఆదినాథస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్22: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం శ్రీ ఆదినాథస్వామి దేవాలయం సోమవారం ఆలయంలో దొంగల దోపు కార్యక్రమం జరిగింది. జాతర జరగనుంది. రాత్రి 12గంటలకు స్వామివారి రథోత్సవం జరగనుంది.

మేడే వారోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్22: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆదివారం మేడే వారోత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సంబరాలను వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు (శ్రామిక స్పందన) రాష్ట్ర అధ్యక్షుడు సుద్దపల్లి సుధాకర్, రాష్ట్ర సహాయకార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మేడే వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పైడి

ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

డిచ్‌పల్లి,ఏప్రిల్ 22: మండలంలోనిఅన్ని గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని పాఠ శాలలో తాగు నీరు, పారిశుద్ధ్య అంశాలపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ యోహన్ ఎంపీడీవో రహీం దర్ గ్రామ కార్యదర్శులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు కూడా నిర్లక్ష్యంగా చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారం, ఏఈ, కార్యదర్శులు, హెచ్ఎం పాల్గొన్నారు.

నలందలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో గల నలంద హైస్కూల్‌లో సోమవారం ప్రీప్రైమరీ నుంచి ప్రైమరీలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు మురళీకృష్ణ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.చదువుపట్ల అభిలాషను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌లను అలవాటు చేయకుండా ఆటల రూపంలో చదువును ప్రేరేపించాలని అన్నారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.76,200	రూ.70,300	రూ.875

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫ్యామిలీ స్టార్ (1.10, 7.25)
: టిల్లు స్క్వేర్ (4.30, 10.25)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.40)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (7.15)
స్క్రీన్-3 : తెప్ప సముద్రం (1.40)
: పారిజాత పర్వం (4.35)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (7.30)
: మార్కెట్ మహాలక్ష్మి (10.35)
స్క్రీన్-4 : హ్యాపిడేస్ (1.30)
: లవ్‌యూ శంకర్ (తెలుగు) (4.50)
: టెనెంట్ (7.30)
: మైదాన్ (హిందీ) (9.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (1.45, 7.30)
: మంజుమ్మల్ బాయ్స్ (4.35, 10.30)
స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (11.00, 1.40)
: ఫ్యామిలీ స్టార్ (4.25, 10.30)
: హ్యాపిడేస్ (7.35)
స్క్రీన్-3 : హ్యాపిడేస్ (10.40, 4.30, 10.30)
: మంజుమ్మల్ బాయ్స్ (7.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : హ్యాపిడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్